## క్లుప్తంగా

### శ్మశానవాటికలో అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

మునగపాక: టి.సిరసపల్లి శ్మశానవాటికలో అభివృద్ధి పనులను శనివారం రాత్రి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు పరిశీలించారు. ఇక్కడ శ్మశానవాటిక అభివృద్ధికి వెంకటాపురంలోని ఆర్‌హెచ్‌ఐ క్లాసిల్ కంపెనీ రూ.30 లక్షల మేర నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

### స్నేహపూర్వకంగా మెలగాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని గంటవానిపాలెం దళితకాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులకోసం అవగాహన పెంచుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. చిన్న చిన్న వివాదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఒకేషనల్ పరీక్షకు 196 మంది గైర్హాజరు

అనకాపల్లి టౌన్: జిల్లాలో పదో తరగతి ఒకేషనల్ ఎడ్యుకేషన్ పబ్లిక్ పరీక్షకు 196 మంది విద్యార్థులు హాజరు కాలేదని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు శనివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 29 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 4,999 మంది విద్యార్థులకుగాను 4,803 మంది హాజరయ్యారన్నారు.

### పంచాయతీ కార్మికులకు వేతనం పెంపు



పంచాయతీ కార్మికులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ విమలా నాయుడు

అచ్యుతాపురం రూరల్: తమ పంచాయతీ కార్మికులకు రూ.500 వేతనం పెంచినట్లు అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు విమలా నాయుడు తెలిపారు. శనివారం వారికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్మికులకు బహుమతులతోపాటు మిఠాయిలు పంచిపెట్టారు. పంచాయతీ కార్మికులు ఎప్పటికప్పుడు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నందనే ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నారు. ఎండ తీవ్రతకు అనుగుణంగా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛ పంచాయతీగా అచ్యుతాపురానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ శైలజారాణి, పంచాయతీ అసిస్టెంట్లు కిరణ్మయి, మూర్తి పాల్గొన్నారు.

### ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బోయిన చిన్నారావు, కార్యదర్శిగా యేశపోగు సుధాకర్ రావు, కోశాధికారిగా కేఎస్ఎస్ సాయిప్రసాద్, కో చైర్మన్లుగా జీఎస్ చక్రవర్తి, జాకబ్ రవీంద్ర బాబు, డిప్యూటీ సెక్రటరీలుగా గొంది చిన్నబ్బాయ్, ఆచంట రవి, ఎస్ దుర్గాప్రసాద్, వై జానకీరామ్ నాయుడు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ చందోలు వెంకటేశ్వర్లు నూతన కమిటీని అభినందించారు.

# పంచదార చిలక... రంగుల చేట



అమ్మకానికి సిద్ధంగా పంచదార చిలకలు



రంగుల చేటలు

- నేడు పాయకరావుపేటలో చిలకల తీర్థం
- పేరంటాలమ్మ గుడి వద్ద తిరునాళ్లు
- సెంటిమెంట్‌తో చిలకలు, చేటల కొనుగోలు

నక్కపల్లి/పాయకరావుపేట: నోరూరించే పంచదార చిలకలు... రంగురంగులతో ఆకర్షించే చేటలు... ఒకప్పుడు వివాహ శుభకార్యాల్లో చూడముచ్చటగా కనిపించేవి. రానురాను ఇవి కనుమరుగవుతున్నా, ఏటా ఉగాది నాడు పాయకరావుపేటలో జరిగే చిలకల తీర్థంలో మాత్రం కనువిందు చేస్తుంటాయి. 50 ఏళ్లుగా పేరంటాలమ్మ ఆలయం వద్ద జరిగే ఈ చిలకల తీర్థానికి తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల నుంచి భారీగా జనం హాజరవుతుంటారు. చిలకలు, చేటలు భారీగా కొనుగోలు చేస్తుంటారు. పేరంటాలమ్మతల్లి పండగ సందర్భంగా ఏటా ఆలయంలో అమ్మవారికి మలిపెద్ది వారి కుటుంబీకులు తొలిపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారికి బోనాలు తీసుకెళ్లి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేస్తారు.

పట్టణవాసుల ఇలవేల్పుగా పేరంటాలమ్మ పుణ్యస్త్రీగా చనిపోవడంతో మహిళలు అధిక సంఖ్యలో ఉగాది రోజున పసుపు కుంకుమలు సమర్పించుకుంటారు. దీనికి నిదర్శనంగా పేరంటాలమ్మ గుడికి వచ్చిన వారు పంచదార చిలక, రంగుల చేట కొనుగోలు ఆనవాయితీగా మారింది. చేటలు, చిలకలు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్తే నిండు నూరేళ్లు పసుపు, కుంకుమలతో ముత్తైదువుగా ఉంటామనేది మహిళల నమ్మకం. చేటలు, చిలకలు విక్రయాలు భారీగా జరుగుతుండటంతో కాలక్రమేణా చిలకల తీర్థంగా పేరు వచ్చింది.

**భారమైన చిలకలు, చేటల తయారీ..**

ఈ తీర్థంలో చిలకలు, చేటలు వివిధ రంగుల్లో తయారు చేసి వివిధ సైజుల్లో విక్రయిస్తారు. వీటిని ఇంటికి తీసుకువెళ్లి దేవుడు వద్ద ఉంచి పూజలు చేస్తారు. తీర్థం రోజున చిలకలు, చేటలు అమ్మకాల దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు వారం రోజుల ముందే వీటి తయారీలో నిమగ్నమయ్యారు. రానురాను ఇతర ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు ఇక్కడకు వచ్చి విక్రయించడంతో దీనిపై ఆధారపడే వారికి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. పంచదార, వెదురు రేట్లు పెరగడంతోపాటు పనిచేసే వారికి కూలి రేట్లు ఎక్కువగా ఉన్నాయని తయారీదారులు చెబుతున్నారు. మార్కెట్‌లో పంచదార కిలో రూ.45 నుంచి రూ.60 ఉంది. వెదురు ధరలు కూడా భారీగా ఉన్నాయి. అర కిలో చిలక రూ.60 ఉంటుంది. ముప్పావు కిలో చిలక రూ.80, కిలో చిలక రూ.100 నుంచి రూ.120కు విక్రయిస్తారు. రంగుల చేటలయితే రూ. 50ల వరకు విక్రయిస్తారు.

**సాయంత్రం 4 గంటల నుంచి తిరునాళ్ల సందడి**

ఈ సందర్భంగా సాయంత్రం భారీస్థాయిలో తిరునాళ్లు నిర్వహిస్తారు. పాయకరావుపేట, ఎలమంచిలి, నక్కపల్లి, అడ్డురోడ్డు, తుని అన్నవరం, కోటనందూరు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది తిరునాళ్లకు తరలివస్తారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఆలయం వద్ద మంగవరం రోడ్డులోను రద్దీగా ఉంటుంది. సాయంత్రం 4 నుంచి 10 గంటల వరకు సందడిగా ఉంటుంది. వేలాది మంది రాకతో మెయిన్ రోడ్డు కిటకిటలాడనుంది.



పేరంటాలమ్మ గుడి

**వాహనాల రాకపోకలకు ఆంక్షలు...**

తుని వెళ్లాలంటే వై జంక్షన్ నుంచి బైపాస్‌రోడ్డు, షుగర్ ఫ్యాక్టరీ జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. పోలీసులు పాయకరావుపేట పట్టణంలో నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా తుని వెళ్లడంపై ఆంక్షలు విధిస్తారు. కేవలం కాలినడకన తప్ప ద్విచక్ర వాహనాల్లో వెళ్లడానికి వీలుపడదు. వాహనాల్లో వెళ్లాలంటే రాత్రి 11 గంటల తర్వాతే వెళ్లాల్సి ఉంటుంది.

**భారీ బందోబస్తు**

పాయకరావుపేటలో చిలకల తీర్థాన్ని పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ అప్పన్న తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి పట్టణంలో నుంచి తుని రాకపోకలు తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. కాలినడకన తప్ప వాహనాల్లో వెళ్లడానికి వీల్లేదన్నారు. వాహన చోదకులు పోలీసులకు సహకరించాలన్నారు. తిరునాళ్లకు వచ్చే వారిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘర్షణలు జరిగేందుకు ప్రోత్సహించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఘనంగా నూకాంబిక అమ్మవారి పండగ



గణపర్తిలో గుండం తొక్కుతున్న భక్తులు



నూకాంబిక ఆలయం వద్ద భక్తులు



నూకాంబికను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలో శనివారం కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ నూకాంబిక అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నేతలు కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి కాశీబాబు, పిన్నమరాజు రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మళ్ల రామజగన్నాథం తగు ఏర్పాట్లు చేశారు. గణపర్తిలో నూకాంబిక వేడుకల్లో భాగంగా భక్తులు అగ్నిగుండం తొక్కి భక్తిని చాటుకున్నారు.

పాయకరావుపేట: కొత్త అమావాస్య సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో నూకాంబిక ఆలయాలు కళకళలాడాయి. పట్టణంలో నూకాలమ్మ గుడి, మంగవరం గ్రామంలో అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి చీరలు, గాజులు, పసుపు, కుంకుమలు, సమర్పించారు. ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

నక్కపల్లి: కొత్త అమావాస్య పండగను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నక్కపల్లి, వేంపాడు, గొడిచర్ల, ఉద్దండపురం, ఉపమాక, తదితర గ్రామాల్లో నూకాలమ్మ ఆలయాలకు ఉదయం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పసుపు కుంకుమ, కానుకలు సమర్పించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

# మోసపూరిత హామీలపై నిలదీయండి

- ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ తదితరులు

ఎస్.రాయవరం: సీఎం చంద్రబాబు మోసపూరిత హామీలు ప్రజలకు వివరించి ఎక్కడికక్కడే కూటమి నేతలను నిలదీయాలని ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి తెలిపారు. తిమ్మాపురంలో నూకాంబిక జాతర పురస్కరించుకుని అమ్మవారిని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావుతో కలిసి ఆమె శనివారం దర్శించుకున్నారు. ముందుగా పార్టీ శ్రేణులతో ముచ్చటించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటినా ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. తీర్మానాలు లేకుండా కూటమి నేతలకు అనుకూలమైన చోట రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారన్నారు. పంచాయతీ తీర్మానాలు చేస్తే గ్రామంలో అవసరాలు తెలుస్తాయన్నారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వమ్మవరం ఎంపీటీసీ బాలం సూరిబాబు, నాయకులు కొణతాల శ్రీనివాసరావు, వియ్యపు వరహాలురావు, బొండా దివాణం, మందగుదుల వెంకటరమణ, శ్రీకాంత్, హరి పాల్గొన్నారు.

# నూకాలమ్మా.. కాపాడమ్మా

- పట్టణం, గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో కొత్త అమావాస్య వేడుకలు



యలమంచిలిలో ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు

యలమంచిలి రూరల్: ఫాల్గుణ అమావాస్య సందర్భంగా భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లి నూకాలమ్మ అమ్మవారి పండుగను శనివారం యలమంచిలి పట్టణం, గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పలుచోట్ల గ్రామాల్లో అమ్మవారి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అమ్మవారికి చీర, జాకెట్టు, గాజులు, నల్లపూసలు, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. యలమంచిలి పట్టణంలో పోస్టాఫీసు పక్కనున్న నూకాంబిక ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు బిక్కవిల్లి సత్యనారాయణ శర్మ అమ్మవారికి అభిషేకం నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతించారు. ఇక్కడ ఆలయంలో భక్తులకు ఉచితంగా ప్రసాద వితరణ చేశారు.



యలమంచిలిలో అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**5 వేల మందికి మజ్జిగ పంపిణీ**

యలమంచిలి పట్టణంలో నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద భక్తుల దాహార్తి తీర్చేందుకు ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంజీవని యోగా సెంటర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. యోగా కేంద్రం నిర్వాహకుడు మళ్ల రాము ఆధ్వర్యంలో 5 వేల మంది భక్తులకు మజ్జిగ అందజేశారు. పలువురు సేవకులు స్వచ్ఛందంగా ఇక్కడ తమ సేవలు అందజేశారు.



యలమంచిలిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంజీవని యోగా కేంద్రం నిర్వాహకులు

కోటవురట్ల: మండలంలో కొత్త అమావాస్య పండగను శనివారం భక్తి శ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా నూకాంబిక అమ్మవారి ఆలయలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కైలాసపట్నంలోని నూకాంబిక అమ్మవారిని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ చామంతుల శ్రీనివాస్ దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు, యువకులు, కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.



కైలాసపట్నంలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయరాజు

# సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు

- సర్వసిద్ధి పీహెచ్‌లో డీఎంహెచ్‌వో రవికుమార్ తనిఖీ

ఎస్.రాయవరం: పీహెచ్‌సీ సిబ్బంది సమయపాలన పాటించకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ తెలిపారు. సర్వసిద్ధి పీహెచ్‌సీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాఫ్ నర్సు, ల్యాబ్ రికార్డులు పరిశీలించారు. నిత్యం ఓపీ ఎంత వస్తుంది, ఎవరెవరు అందుబాటులో ఉన్నారనే వివరాలు ఆరా తీశారు ఆపరేషన్ థియేటర్ పరిశీలించారు. కర్రివానిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ కార్యక్రమంలో ఉన్న పీహెచ్‌సీ వైద్యాధికారి వాసంతిని ఫోన్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ సిబ్బందికి పలు సూచనలు విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆ సమయంలో పీహెచ్‌సీకి వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను సంతృప్తికరంగా ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జ్ వైద్యాధికారి సీహెచ్ దీపిక ఉన్నారు.

# క్రికెట్ ఆటకు వెళ్లిన బాలుడికి విద్యుదాఘాతం

యలమంచిలి రూరల్ : సరదాగా స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా విద్యుదాఘాతానికి గురై 7వ తరగతి విద్యార్థి రాజాన గుణశేఖర్(13) గాయపడ్డాడు. ఈ ఘటన యలమంచిలి పట్టణం పాతవీధిలో శనివారం చోటు చేసుకుంది. కొత్త అమావాస్య కావడంతో పాతవీధిలో కొందరు హైస్కూల్ విద్యార్థులు క్రికెట్ ఆడుతుండగా బంతి పక్కనున్న రేకుల షెడ్డుపై పడింది. దాన్ని తీసేందుకు రేకుల షెడ్డు ఎక్కిన విద్యార్థి గుణశేఖర్ తొందరలో పైన ఉన్న విద్యుత్ వైర్లు చూసుకోకపోవడంతో వాటిని తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే గాయపడిన విద్యార్థిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



# పాఠశాల ప్రహరీ నిర్మాణానికి 'ఎస్ఎన్ఎఫ్' వితరణ

అచ్యుతాపురం రూరల్: స్థానిక ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి పరవాడ ఎస్ఎన్ఎఫ్ వాటర్ సైన్స్ కంపెనీ ముందుకొచ్చింది. ఈ మేరకు శనివారం స్థానిక ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకుడు పీఎస్‌టీ పట్నాయక్‌కు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రన్ కుమారేషన్ తన వంతు సహాయంగా రూ.6 లక్షల చెక్కు అందజేశారు. కంపెనీ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీను, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల కరస్పాండెంట్‌కు చెక్కు అందజేస్తున్న ఎండీ రాజేంద్రన్

## వాలీబాల్ పోటీల విజేత మెలిపాక

యలమంచిలి రూరల్: తురంగలపాలెంలో నూకాలమ్మ జాతర సందర్భంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎంపీపీ బోదెపు గోవింద్ శనివారం ప్రారంభించారు. గ్రామంలో ఏటా కొత్త అమావాస్య రోజున ఆటల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన మెలిపాక, రెండో స్థానం పొందిన యలమంచిలి జట్లకు నగదు బహుమతులు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ గోవింద్

## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన ముస్లిం యువకులు

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీలోని మసీదుకు సమీపంలో చలివేంద్రాన్ని ఎంపీటీసీ వుట్రేవు వెంకట సూర్యారావు శనివారం ప్రారంభించారు. స్థానిక ముస్లిం యువకుల ఆధ్వర్యంలో మొదటి రోజున మజ్జిగ పంపిణీ చేశారు. వెంకటసూర్యారావు మాట్లాడుతూ వేసవి దృష్టిలో పెట్టుకుని రహదారులు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు యువకులు ముందుకు రావాలన్నారు.

## 3న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

మునగపాక: స్థానిక మండల పరిషత్ హాలులో వచ్చే నెల 3వ తేదీన కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. 26 పంచాయతీల పరిధి లో కులాల వారీగా బీసీ-93, కాపు-16, బ్రాహ్మణ-2, క్షత్రియ-1, రెడ్డి -1, వైశ్య -1, ఈబీసీ-2 మొత్తం 116 మందికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సమ్మతించాయన్నారు. 628 మంది కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్నారని, వారందరికీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తు దారులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

## రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడకు ఎంపికైన క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో అసోషియేసన్ సభ్యులు

అచ్యుతాపురం రూరల్: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో సీనియర్ విభాగంలో ఎంపికలు నిర్వహించినట్లు రగ్బీ జిల్లా గౌరవాధ్యక్షుడు కూండ్రపు వెంకునాయుడు, అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎన్.వి. జగదీష్ తెలిపారు. వచ్చే నెల 14, 15 తేదీల్లో అనంతపురం జిల్లా డీటీసీ పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ పోటీలకు అనకాపల్లి జిల్లా నుంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో గెలుపొంది దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోశాధికారి రమేష్, జిల్లా సెక్రటరీ వెంకట్, సభ్యులు పైల అప్పలనాయుడు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు నిలదీత



మాట్లాడుతున్న ఎంఈవో గాంధీ



సమావేశానికి హాజరైన మండల పరిషత్ సభ్యులు

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని మండల పరిషత్ సభ్యులు అధికారులను నిలదీశారు. ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెంకటనగరం, రాజానగరం గ్రామాల్లో వోల్టేజీ సమస్య ఉందని, విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించాలని వెంకటనగరం సర్పంచ్ కోరారు. గ్రామాల్లో రోడ్లపై విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరారు. మత్స్యకార గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన తుఫాన్ షెల్టర్లను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. వీటి పక్కనే పాఠశాలల్లో చదువుకుంటున్న వందలాది మంది విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. మండలంలో ప్రతి గ్రామంలోను ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పాల్తేరు శివారు అంకంపేట గ్రామంలో వాటర్ ట్యాంకు ప్రారంభించాలని ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ అధికారులు అడిగారు. పట్టణంలో అంబేద్కర్, రాజీవ్ నగర్ కాలనీల్లో తాగునీరు సమస్య ఉందని ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ సభ దృష్టికి తీసుకొచ్చారు. వెంకటనగరంలో డి.ఫారం భూములు సమస్య, శ్రీరాంపురంలో గ్రామ కంఠం సమస్యను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరారు. రైతులకు సాగు నీరు సరఫరా జరిగే ముఠా కాలువల్లో చెత్త వేస్తున్నారని అధికారులు స్పందించాలన్నారు. మండల పరిషత్ సమావేశాలకు పీహెచ్‌సీ వైద్యులు హాజరు కాకపోవడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సర్పంచ్‌లను, ఎంపీటీసీలకు అధికారులు సమాచారం అందించడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాలల ఎదుట పెద్ద ఫ్లెక్సీలు కడుతున్నారని, వాటిని తొలగించాలని ఎంఈవో కె.ఎస్. గాంధీ సభకు విన్నవించారు. ఎస్.నర్సాపురం పాఠశాల స్థలం ఆక్రమించారని, సంబంధిత సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, ఏఎస్‌ఐ పి.గోవిందరావు, పంచాయతీ రాజ్ డీఈ వై.హరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.